# స్వతంత్ర వివాహము

'స్వతంత్రం, స్వతంత్రం అంటూ చెప్తారు కాని వారి వారి స్వతంత్రాలను వారికి వదలిపెట్టాలని ఎవరికీ లేదు' అనుకుంటూ విసుగ్గా కుర్చీలో కూర్చున్నాడు శేఖర్. ఎదురుగా టేబుల్ మీదవున్న దీపాన్ని చూస్తూ అల్లాగే కూర్చుండిపోయాడు. తన మనస్సు వనజపరమయిపోయింది. అతను ఆమెతో కలసి కాలేజీలో చదివిన రోజులు, ఆ కళ్ళు, ఆ నడక, ఆ వయ్యారము-తల్చుకొంటే కళ్ళుజలదరించిపోతోంది శేఖర్ కు. వెంటనే ఆమె కొక ప్రేమలేఖరాయాలనిపించింది. అల్లా అనుకొని ప్రారంభించేలోగా విచారగ్రస్తురాలైన తన తల్లి, కోపంతో వున్న తండ్రి జ్ఞాపకమొచ్చారు. తండ్రి ధ్యాస వచ్చినపుడల్లా, అన్నీ మర్చిపోయి ఒళ్లంతా మండిపోయినట్లయిపోతుంది తనకి-ఈ విధంగా ఆలోచనలతో భోజనముచేయటముకూడా మర్చిపోయాడు.

ఇంకా శేఖర్ భోజనముచేయలేదని వెతుక్కుంటూ శేఖర్ గదిలోకి వచ్చింది తన తల్లి. శేఖర్ దేనినిగురించి అంత తీవ్రంగా ఆలోచిస్తున్నాడో ఆమెకు తెలుసు. అయినప్పటికి ఆ విషయం కెలకదల్చుకోలేదు.

'పదిగంటలు దాటిపోయింది. ఇంకా భోజనము చేయలేదా!' అంది. తన తల్లి తన గదిలోకి రావటమే చూడని శేఖర్ తల్లి గొంతుక విన్నవెంటనే—

'అమ్మా! ఇది అసంభవము. ఇది జరగదు. ఎవరు చెప్పినా నేను వినదల్చుకోలేదు. ఇది నా యిష్టానికి సంబంధించినది.' అంటూ దగ్గిరికి వచ్చాడు శేఖర్.

'ఏది నీ యిష్టానికి సంబంధించినది? ఎవరు నీ యిష్టములో కలగచేసుకొన్నారు?' అంది సౌమ్యంగా.

'నా వివాహ విషయము నా యిష్టం. అందులో నువ్వు, నాన్నగారు కలగచేసుకోవటము ఏమి బాగాలేదు.'

'వివాహ విషయము ఒక్కటే నా నీయిష్టం? నిన్నుకని, పెంచి, పెద్దచేసి, చదివించిన దంతా నీ యిష్టంలో చేరలేదా?'

'దానికీ దీనికీ ఏమిటమ్మా సంబంధము? నాకు యిష్టమైన అమ్మాయిని నేను పెళ్ళి చేసుకోవటము, నాకు యిష్టములేని అమ్మాయిని నేను పెళ్ళిచేసుకోక పోవటము— నాకు సంబంధించినది కాదా?'

'అవును. నీకు సంబంధించినదే. అయితే నీ యిష్టం ఒక్కటే చూసుకొంటే చాలు ననుకొంటున్నావా? నువ్వు ఇష్టమంటూ చేసేపని మంచిదా, కాదా అనిచూసి సరియైన దారి చూపవలసిన బాధ్యత మాది కాదా?'

'నేను యిపుడు ఏం తప్పు చేశాను'— విసుగ్గా అన్నాడు శేఖర్.

'నువ్వు మీ నాన్నగారు చెప్పినట్లు వినక పోవటమే చాలా పెద్ద తప్పు. ఆయన, సుబ్బల్ని నీకిచ్చి తప్పకుండా పెళ్ళి చేస్తానని సుశీలమ్మగారికి ప్రమాణము చేశారు. ఆయన మాటను దాటి పోవటము నీకు న్యాయమా?'

'ఆయన చేసిన ప్రమాణానికి బాధ్యుడను నేనన్నమాట. ఇదేనా తండ్రి కొడుక్కి యిచ్చే స్వతంత్రము!...అమ్మా! ఆఖరుసారిగా చెప్తున్నాను. ఈ వివాహము జరగనే జరగదు...పేరు చూడు...సుబ్బులు... ఆ పేరు వింటేనే చాలు నాకు......'

'పేరులో ఏముంది నాయనా! దానికి వున్న అందచందాలు ఎవరికి వున్నాయి! చేతికి వచ్చినట్లు పౌడర్లు, స్నోలు యింకా ఏమోమో రాసుకొని 'టిప్‌టాప్'గా వదుస్తే నిజంగా అందంగా వున్నారనుకొంటున్నావా? అది నీ మేనమామ కూతురని మర్చిపోయావా?' అని వీలైనంతవరకు చెప్పి చూసింది శేఖర్ తల్లి.

'అమ్మా' మామయ్యకూతురనో లేక ఇంకవరి కూతురనో చేసుకునే రోజులు పోయాయి. ఇటువంటి మాటలన్నింటిని మూటకట్టి పుల్లలబండిలో వేసి కాశీయాత్రకు పంపేరోజులు వచ్చాయి.' అనేశాడు శేఖర్ ధైర్యంచేసి.

ఈమాటలు వింటూనే శేఖర్ తండ్రి ప్రకాశరావు ఆయనచెల్లెలు భర్త రఘుపతి అక్కడికి వచ్చారు. తల్లిదగ్గర వాదించినట్లు తండ్రిదగ్గర వాదించగల ధైర్యంలేదు శేఖర్ కు. ఆవిధంగా ఏప్పుడూ జరగలేదు. తండ్రి రావటముతోనే శేఖర్ నోరు మూతబడింది. తలవంచుకొని నిల్చున్న శేఖర్ నుచూసి—

'శేఖర్' పిడుగులాగ వినిపించింది తండ్రి గొంతుక.

'చదివి డిగ్రీ సంపాదించినవాడివి. నువ్వు యీవిధంగా మారతావని మేము కలలో కూడా అనుకోలేదు. ఏదో స్వతంత్రం, స్వతంత్రం అంటూ తెగ వాగుతున్నావే, నీకు ఏదితోస్తే అదిపట్టుకు వేళ్లాడటమేనా స్వతంత్రం? నిజమైన స్వతంత్రానికి నీతికి మంచి, చెడ్డ, కట్టుబాటులున్నాయి. నీలాంటి మూర్ఖుడు ఏవాడుకూడా నిజమైన స్వతంత్రాన్ని పొందలేడు. ఇన్నాళ్ళనుంచి మేనరికం చేసుకోవడానికి యిష్టపడిన నువ్వు 'అకస్మాత్తుగా ఏం స్వతంత్రాన్ని కనుక్కున్నావు?' అంటూ ఘాటుగా అంటించాడు శేఖర్ తండ్రి.

"దాన్ని పెళ్లి చేసుకోవటానికి నాకు యిష్టము వుండవద్దా?"

"ఇప్పుడు నీకు యిష్టము ఎలావుంటుంది. నామీద, నిన్ను కని పెంచినదానిమీద యిష్టమున్నంతకాలము సుబ్బులును చేసుకోనేందుకు యిష్టపడ్డావు...మామీద నీకున్న గౌరవమంతా గంగలో కలసింది. ఆఖరుసారిగా చెపున్నాను. నా చెల్లెలు చనిపోయేముందు సుబ్బులును నీకే యిచ్చి చేసుకొంటానని వాగ్దానము చేశాను. అందుకు నువ్వు కూడా యిష్టమున్నవాడివిగా యింతవరకు నడచుకొంటూ వచ్చావు. వివాహము తొందరలో చేయాలనే ఆశతో మీ మేనమామకూడ వచ్చాడు. నువ్వు నేచెప్పినట్లు వింటావా చాలా సంతోషము. లేదూ నీ స్వతంత్రమే నా మాటకన్నా గొప్పదైతే ఏదో ఒకటి తేల్చి చెప్పు' అన్నాడు తండ్రి.

శేఖర్ ఏమి బదులు పలుకకుండా తల వంచుకొని నిల్చున్నాడు. ఇంతవరకు ఏమి మాట్లాడకుండా వున్న శేఖర్ మేనమామ, శేఖర్ తండ్రితో 'సుబ్బులు వీడిమీద పంచప్రాణాలు పెట్టుకొని వుంది. దాన్ని మోసం చేయటం న్యాయంకాదు. వీడు సుబ్బులుని చేసుకోడని అనుమానంతో కాబోలు చాలామంది సంబంధంకోసం వస్తున్నారు. ఎం. ఏ. ప్యాసయి, ఒక ఆఫీసరు హోదాలో వున్న రాజారావు అనే అతను అమ్మాయిని చేసుకోవాలని చాలాపట్టుదలతో వున్నాడు. నాకుమాత్రము సుబ్బులును వీడికి తప్ప యింకొకరికి యివ్వటము యిష్టము లేదు, అన్నాడు.

'విన్నావా శేఖర్ జాగ్రత్తగా ఆలోచించుకో,' అన్నాడు శేఖర్ తండ్రి.

శేఖర్ జవాబు చెప్పలేదు. ఆలోచిస్తున్నట్లుగా తోచింది వారందరికి. వారిలో 'ఆశారేఖ' తొంగిమాసింది.

'బాగా ఆలోచించుకొని రేపు చెప్పు నీ సమాధానము. ఇపుడేమి తొందరలేదు' అని మళ్ళీ అన్నాడు శేఖర్ తండ్రి. ఆనాటి



# ★ స్వతంత్ర వివాహము ★

సంభాషణ ముగిసింది.

## 2

శేఖర్ తండ్రి ప్రకాశరావు మద్రాసులో ఒక గొప్పవ్యాపారి. లక్షాధిపతి. ప్రకాశరావు పుట్టిన మరుసటి సంవత్సరమే పుట్టింది అతని ఒక్కగానొక్క చెల్లెలు సుశీల. పేరుకు తగినట్లుగా చాలా గుణవంతురాలు. చిన్నతనంలోనే అన్నిపనులు నేర్చుకుంది తల్లి సహాయంతో. సుశీల ఆడపిల్లల బడిలోను ప్రకాశరావు మగపిలలబడిలోను చదువు ఆరంభించారు. అతి అన్యోన్య భావంతో మెలిగే వారా సోదరీసోదరులు. సుశీల యస్. యస్. యల్. సి. పరీక్షకు వెళ్లిన సంవత్సరమే వారి తండ్రి పోయారు. అంతటితో వారి చదువు ఆగిపోయింది.

సుశీల అందము, గుణగణాలు చూసి ఆమెను వివాహము చేసుకొనేటందుకు చాలామంది ముందుకు వచ్చారు. వారిలో కొందరు కోటీశ్వరులు కూడా వున్నారు. కాని ప్రకాశరావు డబ్బుకు ఆశపడక తన దూరబంధువైన రఘుపతికి ఇచ్చి చేయాలనుకున్నాడు. సుశీలా రఘుపతులు ఒకరినొకరు ప్రేమించుకొన్నవారు కారు. కనీసము ఒకరినొకరు ఎప్పుడూ చూడలేదు. రఘుపతి అందగాడే. చదువుకొన్నవాడే. డబ్బుని నమ్మి సుశీలను ఒక కోటీశ్వరునికి యివ్వటంకన్నా, రఘుపతి వంటి యోగ్యుడు, గుణవంతుడు అయిన ఒక సామాన్య కుటుంబీకునికి యిచ్చి వివాహము చేయటము ఉత్తమమని ఎంచి ముహూర్తము నిశ్చయించాడు ప్రకాశరావు.

సుశీలా రఘుపతుల వివాహము అతివైభవంగా మద్రాసులో జరిగింది. అప్పటినుంచి రఘుపతి, ప్రకాశరావుకు వ్యాపారంలో 'చేదోడువాదోడు'గావుండి చాలా సహాయం చేశాడు. తత్ఫలితం లాభం లెక్కలకు దాటిపోయింది. ప్రకాశరావు తండ్రి మలయా, సింగపూరు ప్రాంతాలలో ప్రబల వ్యాపారిగా చెలామణీ అయినవాడు. ఆయనఅక్కడ సంపాదించిన డబ్బుతో ఒక పెద్ద రబ్బరు తోట కొన్నాడు. అక్కడ పనులను చూసేందుకు తగిన మనుష్యులను నియమించి ఆయన జాగ్రత్తగా చూసుకొంటూ వుండేవారు. ఆయన పోయిన తరువాత అక్కడి మేనేజరు వచ్చిన లాభమంతా దుర్వినియోగము చేసి తప్పుడులెక్కలుపంపటము మొదలుపెట్టాడు. అందుచేత ఒక కొత్త మేనేజరును నియమింపవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రకాశరావుకి. ప్రకాశరావు దృష్టిలో రఘుపతికన్న నమ్మకస్తుడు, సమర్థుడు యింకెవ్వరూ పడలేదు. అందుచేత రఘుపతిని సింగపూరు కార్యాలయానికి పంపించాడు. సింగపూరు వెళ్ళిన రఘుపతి చెడిపోయిన పరిస్థితినంతటిని సరిచేసి, సమర్థులయిన పనివారిని నియమించాడు. తనకు సింగపూరు చాలా బాగున్నదని తన కాపరాన్ని సింగపూరులోనే పెట్టుకుంటానని చెప్పి, ప్రకాశరావు యిష్టముమీద సుశీలను కూడా తీసుకొని వెళ్ళి అక్కడే స్థిరనివాస మేర్పరచుకొన్నాడు.

ఆ తరువాత ఒక సంవత్సరానికి ప్రకాశరావుకు వివాహము జరిగింది. రఘుపతి చల్లని చేయి పడటముతోనే రబ్బరు తోటలమీద ప్రతి సంవత్సరము వచ్చే లాభంకన్నా మూడింతలు లాభము వచ్చింది ఆ సంవత్సరము. ప్రకాశరావు సంతోషము వర్ణనాతీతము. ఆ వివాహానికి సుశీలా రఘుపతులు వచ్చివెళ్లారు. ఆ తరువాత సంవత్సరము ప్రకాశరావుకు శేఖర్ పుట్టాడు. ఆ తరువాత మూడు సంవత్సరములకు సుశీల గర్భవతి అయింది. పురిటికి సుశీలను మద్రాసు తీసుకొని రావాలనుకొన్నాడు ప్రకాశరావు. కాని సుశీల గర్భవతి అయినప్పటినుంచి ఆమె ఆరోగ్యము క్షీణించసాగింది. అందుచేత సుశీలను సింగపూరులోనే వుంచేశాడు రఘుపతి. అక్కడే పుట్టింది సుబ్బులు. రఘుపతి ఇష్టదైవము 'సుబ్బారాయుడు' కావటంచేత 'సుబ్బులు' అని నామకరణం చేశాడు.

సుబ్బులు పుట్టినప్పటినుంచి సుశీల ఆరోగ్యము ఇంకా హీనదశకు వచ్చింది. ఏరోజుకారోజు ఆఖరురోజులా కనిపిస్తూ, ఆరు సంవత్సరాలు కాలప్రవాహములో దొర్లిపోయాయి. తరువాత ఆమెను మద్రాసు తీసుకొనివచ్చారు. తను బ్రతకదని తెలుసుకొన్న సుశీల తన అన్నగారి చేతులు పట్టుకొని 'అన్నయ్యా! యీ మందులు యీ డాక్టర్లు యింక దండుగ. నేను యింక ఎంతో కాలం బ్రతకను. నువ్వు నాకు ఒకమాట యివ్వాలి. నన్ను ఏవిధంగా యింతకాలము చూచుకొన్నావో అలాగే మావారిని, అమ్మాయిని కూడ చూచుకో. సుబ్బులును శేఖరుకు ఇచ్చి చేసుకొంటానని మాట ఇవ్వగలవా అన్నయ్యా' అని అతి హీనస్వరంతో అడిగింది.

ప్రకాశరావుకు అంతులేని దుఃఖం పొంగిపొర్లింది. "అలాగేనమ్మా, సుబ్బులును శేఖరుకు యిచ్చి తప్పకుండా చేసుకొంటాను. ఇది సత్యము' అంటూ ఆమెచేతిలో చేయి వేసి ప్రమాణము చేశాడు ప్రకాశరావు. ఆ మాటలు విన్న కొన్ని క్షణాల తర్వాత ఆమె ఆత్మ వారినుంచి తప్పుకుంది. కన్నీళ్ళతో ఆమెను ముంచివేశారు రఘుపతి, ప్రకాశరావులు. భార్యపోయిన తరువాత రఘుపతి తన కూతురును తీసుకొని సింగపూరు వెళ్ళిపోయాడు. ఆ తరువాత ప్రకాశరావు రఘుపతిని రమ్మని ఎన్నిసార్లు కబుర్లు పంపినా రఘుపతి మద్రాసు రాలేదు. శేఖర్ కు యీ గాథ అంతా తెలుసు.

తన మేనమామ కూతురు పెద్దదౌతోందని, దానిని తనకిచ్చి పెండ్లి చేస్తానని శేఖర్ తండ్రి చెప్పటము అనేకసార్లు తను విన్నాడు శేఖర్ బి. యే. ప్యాసు అయేవరకు వివాహ విషయము సరదాగా మాట్లాడుకొన్నట్లు జరిగిపోయింది. ఆ సమయంలోనే యౌవనంతో ఒళ్ళెరగక సుబ్బులుకు ఒక 'ప్రేమలేఖ' రాశాడు. శేఖర్ బి. యే. ప్యాసు అవటముతోనే అంతవరకు వేడుకగా మాట్లాడుకొన్న విషయాలన్నీ నిజరూపం దాల్చాయి. ఆ సమయంలో సుబ్బులు సింగపూరులో ఒక ఇంగ్లీషు మిషను స్కూల్లో స్కూలుఫైనలు చదువుతోంది. సుబ్బులు కూడా శేఖరుకు జవాబు రాద్దామనుకొంది. కాని తనువుంటున్న హాస్టలు అధికారిణికి భయపడి జవాబు వ్రాయలేదు.

శేఖర్ బి. య్యే చదువుతుండగా 'వనజ' అనే అమ్మాయికూడా అతని క్లాసులో వుండేది. ఆమె ఒక బార్-ఎట్-లా కూతురు. నవనాగరిక సౌందర్య శిఖామణి. ఆమె టెన్నిస్‌లో చాలా అందెవేసిన చెయ్యి. శేఖర్ కూడా టెన్నిస్‌లో చాలా పెద్ద ఆటగాడు. కాలేజీ క్లబ్బులో యిద్దరుకూడా మెంబర్లు. ఒకసారి అఖిలభారత టెన్నిస్ పందాలలో పోటీచేసి, వనజా శేఖర్లు చాలా అద్భుతంగా ఆడి గెలిచారు. చూసిన వారంతా వేయి విధాలుగా పొగిడారు వారిద్దర్నీ. పత్రికలన్నీ వారి ఆటగురించి, వారిగురించి చాలా గొప్పగా వ్రాశాయి. అప్పటినుంచి శేఖర్ వనజకు యింకా కొంచెము దగ్గరయి తనవలను విసిరాడు ఆ చేపను పట్టటానికి! తనతో యిదివరకు కన్న ఎక్కువగా చనువుగా ప్రవర్తిస్తున్న వనజను చూసి, తనను మనస్ఫూర్తిగా ప్రేమిస్తోందని ఊహాలోకంలో ఊగిసలాడుతూ గాలిమేడలు నిర్మించాడు మిస్టర్ శేఖర్. ఇదివరలో ఆమెతో ఎక్కడపడితే అక్కడ మాట్లాడేందుకు బెదిరేవాడు. కాని ఇప్పుడు కాలేజీలో, రోడ్డుమీద, హోటలులో,

అధైర్యపడవద్దు
శాస్త్రీయమైన, నిజమైన SEX— ADVICE పొందవచ్చును. మీకు ఉందుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.
డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్ - 2.
(దక్కన్)

క్లబ్బులో—ఎక్కడికనిపిస్తే అక్కడ నిర్భయంగా మాటాడుతూండటమువలన 'మాసిన దిలా ప్రేమించు' అనే సామెతను జ్ఞాపకం చేస్తున్నాడు యితరులకు. పరిస్థితులు యీ విధంగా వుండటమువలన 'వనజ మితిమీరిన చనువును శేఖరుకు యివ్వటమువల్ల శేఖర్ వనజను ప్రేమించటము తప్పా?' అన్నారు మరికొందరు.

తను వనజను ప్రేమిస్తున్నాడు. కాని యీ విషయాన్ని ఆమెకు తెలియపరచలేకుండా వున్నాడు. వనజ తనవిషయంలో ప్రవర్తిస్తున్నట్లు యింకెవరి విషయంలోను ప్రవర్తించకపోవటమువలన, వనజ కూడా తనను ప్రేమిస్తోందని, తను కూడా తన ప్రేమను ఏవిధంగా తెలియపర్చాలో తెలియాక తికమకపడుతోందని అపోహపడ్డాడు మిసర్ శేఖర్.

సుబ్బులు విషయంలో జరిగిన సంభాషణ తర్వాత, శేఖర్ తప్పకుండా సుబ్బులును చేసికొంటాడని ఆశించారు శేఖర్ తల్లి తండ్రులు. కాని ఆమర్నాడు ప్రొద్దున్న శేఖర్ తన తండ్రికి "సుబ్బులును తను వివాహము చేసుకోవటము అసంభవ"మని ఒక కాగితము వ్రాసి తన బల్లమీద పెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాడు. తండ్రికి చెప్పలేని కోపము వచ్చింది. తల్లి మూర్ఛపోయింది. రఘుపతి శేఖర్ తల్లితండ్రులతో మాట్లాడి సుబ్బులును రాజారావుకు యిచ్చి చేసేందుకు వారి అంగీకారము తీసుకొని సింగపూరు వెళ్ళిపోయాడు

ఇల్లు విడచి వెళ్ళిపోయిన శేఖర్ ఒక స్నేహితునితో ఉంటూవచ్చాడు అదే వూరిలో. తనను ప్రేమిస్తున్నట్లు, తననే వివాహము చేసుకోవాలని తీర్మానించుకొన్నట్లు వనజతో చెప్పాలని తహతహలాడి పోతున్నాడు శేఖర్. కాని అందుకు తగిన సమయం సందర్భం కలిసి రావటము లేదు.

## 3

హేమావతి అనే ఒక లక్షాధిపతికూతురు సిటీక్లబ్బులో చేరింది. ఆమెనుగురించి అందరూ పరిపరివిధాలుగా మాట్లాడుకొంటున్నారు. "భూలోకసుందరి" అని ఒకరు, "అప్సరస" అని మరొకరు "గానమోహిని" అని యింకొకరు-యీ విధంగా ప్రశంసించటము మొదలుపెటారు. ఒకరోజున ఆ క్లబ్బులో ఆమె కోసము ప్రత్యేకంగా ఒక టీ పార్టీ ఏర్పాటు చేయబడింది. ఆ రోజున మంచి ఆటగాళ్ళంతా టెన్నిస్ ఆడేందుకు కూడా ఏర్పాటు చేయబడింది. అఖిల భారత టెన్నిస్ పందెములలో గెలుపొందిన వనజా శేఖరులకుకూడా ఆహ్వానాలు పంపబడ్డాయి. టీ పార్టీ కొద్దిసేపట్లో ఆరంభమవుతుందనగా హేమావతి ఒక అందమైన కొత్త కారులో వచ్చింది. అంతకుముందుగానే వనజా, శేఖరులు అక్కడకు చేరుకొన్నారు. హేమావతి క్లబ్బు సెక్రటరీతోకలసి అతివయ్యారంగా నడుస్తూవచ్చిన అతిథు లందరికీ తన అభివందనాలు తెలిపింది. ముఖ్యంగా చెప్పుకోదగిన వారు వనజా శేఖర్లు. వారి పేర్లు విన్నవెంటనే "ఓ! అఖిల భారత టెన్నిస్ పందెములలో విజయధంకా మ్రోగించిన ఘటికులు," అంటూ వారికి ప్రత్యేకాభివందనములు తెలిపింది హేమావతి. ఆమె మాటలతో పరవశుడయ్యాడు శేఖర్ :

టీ పార్టీ తర్వాత టెన్నిస్ పందెములు ఆరంభించారు. వనజా శేఖర్లు అతిచాతుర్యంగాను, అద్భుతంగాను ఆడి అవతలివాళ్ళకు "నిల్ గేమ్" చేశారు. కరతాళధ్వనులు ఆకాశాన్నంటాయి. టెన్నిస్ పందెములు పూర్తి అవటముతోనే, తన బంధుమిత్రులతో కలసి వనజ వెళ్లిపోయింది.

శేఖర్ బయలుదేరటానికి కాళ్ళు కదలటము లేదు. హేమావతి తన చూపులతో—కాదు తన సమ్మోహనాస్త్రములతో తనని కదలకుండా కట్టేసింది. హేమావతే మాట్లాడించింది.

"నాకు టెన్నిస్ ఆటంటే చాలా యిష్టము. మీ ఆట చాలా గొప్ప సెలు".

"మీరు టెన్నిస్ కూడా ఆడతారా?" అన్నాడు శేఖర్.

"ఏదో కొంచెము. కాని మీ ఆటలాగ-అటువంటి స్టైలు ఎల్లా వస్తుంది"

"ఎందుకురాదు. నా కంటేమీరు బాగా ఆడవచ్చు. సరిగా నేర్చుకొంటే రాకుండా పోతుందా?"

"మీలాంటి ఆటను నేను ఎక్కడా చూడలేదు. నాకు నేర్పుతారా!"

ఏదో కలలో మాట్లాడుతున్నట్లనిపించింది శేఖర్‌కు.

"దాని కేమంత భాగ్యము? ప్రొద్దున్నప్పుడు జనం యిక్కడ ఆట్టేమంది వుండరు. మీరు పొద్దున్నప్పుడు రాగలిగితే నేర్పటానికి నాకేమి అభ్యంతరము లేదు."

"పొద్దున్నప్పుడు రావటానికి నాకేమి అభ్యంతరము లేదు. తప్పకుండా వస్తాను. శలవు," అంటూ వెళ్ళిపోయింది హేమావతి.

మర్నాడు పొద్దున్న ఆరుగంటలకు అతి విలువైన టెన్నిస్ డ్రెస్‌తో క్లబ్బుకు వచ్చాడు శేఖర్. చెప్పినటుగానే హేమావతికూడ వచ్చింది. రెండు సెట్లు ఆడారు. హేమావతి ఆట చాలా సాధారణమయినది.

ప్రతిరోజు హేమావతి పొద్దున్నే క్లబ్బుకు రావటము, శేఖరూ తనూకలసి కొంచెము సేపు ఆడి వెళ్ళటము—యీ విధంగా ఓ పదిహేనురోజులు కాలప్రవాహంలో దొర్లిపోయాయి. హేమావతి చనువును ఆధారంగా తీసుకొని ఆమె బంగళాకు కూడా దారితీశాడు శేఖర్.

ఒక రోజున హేమావతి శేఖర్లుమామూలుగానే మాట్లాడుకొంటున్నారు మేడమీద. ఆ సమయంలోనే తమాషాగాను, కొంటెగాను "మీకు పెళ్ళయిందా?" అంది హేమా

(47-వ పేజీ చూడండి]


### తరచుగ మూత్ర విసర్జన

చక్కెరతోగాని లేక చక్కెర లేకుండాగాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైన చిహ్నము. శరీరాన్ని గుల్ల చేయుటయే కాకుండా యీ వ్యాధి తనబంధంలో చిక్కిన వారిని ఆరోజాకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక మానసిక శ్రమలకు యిచ్చగించకుండుట, నడుములో నొప్పి, చూపు మాంద్యము. తొడల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతోకూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో అధికదాహం, ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు. కాళ్ళలో పగుళ్లు తూకంతగ్గడం. శరీరమంతా పోట్లు. కీళ్ల నొప్పులు, కంటిపొరలు, క్షయ. గడ్డలు రాచ పుండ్లు. యిట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును.

"వీనస్‌ఛారమ్" మాత్రలు వాడి, అనేక వేల మంది తమబాధల నుండివివారణపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి, "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద, ప్రాచీన యూనానివైద్య విధానప్రకారం అమూల్య ఓషధుల శాకపదార్థముల, స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. మూత్రములో పంచదార, పలుమారు మూత్రవిసర్జనచేయు అవసరము 2 లేక 8 రోజులలోనే మీకు చాలాభాగము నివారణగును. కొద్ది రోజులలోనే మీకు పగావికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో. సుఖముగా. తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు నిరాహారముతో నుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై రోగులు యిదివరకటికంటే యెక్కువరకాల ఆహారపదార్థములు తీసికొనవచ్చును. వివరములు గల ఇంగ్లీషు కరపత్రములు అడిగినచో ఉచితముగా పంపబడును. ధర: 50 మాత్రల సీసా రు. 6-75 ప్యాకింగు పోస్టేజి ఉచితము.

లభించు స్థలము:
Venus Research Laboratory (A. P. W.)
P. O. Box No. 587, Calcutta

# ★ స్వతంత్ర వివాహము ★

(23-వ పేజీ తరువాయి)

వతి. ఈ ప్రశ్న విని తన్మయుడయ్యాడు శేఖర్.

"లేదు. నాకు యింకా వివాహము కాలేదు. నాకు యిష్టములేని అమ్మాయిని మా వాళ్ళు చెయ్యాలనుకొన్నారు. నేను అందుకు ఒప్పుకోలేదు "

"భేష్! చాలా మంచిపని చేశారు. నేనూ అంతే!...నాకు యిషము లేని సంబంధము మా వాళ్ళు చేసుకోమన్నారు. నేను అందుకు ఒప్పుకోలేదు. ఇంకేదైనా మంచిసంబంధము చూడటముకోసము మా నాన్నగారు వూరుకు వెళ్లారు. ఆయన చూసిన ఏ సంబంధాన్ని, నేను చేసుకో దలచలేదు. నేను మనసారా ఎవరిని ప్రేమిస్తానో వారినే చేసుకోదలచుకొన్నాను," అంది హేమావతి నవ్వుతూ శేఖర్ ముఖభావాల్ని ఓకంట కనిపెడుతూ.

ఆ మాటలతో శేఖర్ చాలా తృప్తి చెందాడు. శేఖర్‌కు ఆత్రం ఎక్కువ. ఈ సందర్భాన్ని వృధాగా పోనీయకూడదనుకొని, తనను ప్రేమిస్తోంది. కాబట్టే తనతో అంత చనువుగా వ్యవహరిస్తోందని అపోహపడి—

"మనిదరము వివాహాము చేసికొందామా" అనేశాడు శేఖర్.

"వాట్ !..." అంటూ తౌరాజువ్వలా లేచింది హేమావతి. ఏమాతుందోనని శేఖర్ చాలా భియపడ్డాడు.

హేమావతి తనని ప్రతివిషయంలోను పరీక్షిస్తోంది. కాని అది గమనించేస్థితిలో లేడు శేఖర్ కొంచెము సేపు మౌనము వహించి మళ్ళీ మాటాడింది.

"ఏమిటి యీ అకస్మాత్తాలోచన? మీ టెన్నిస్ ఆటను చూసి మెచ్చుకొని, మీతో చనువుగావుండి, ప్రతిరోజు మీదగ్గర టెన్నిస్ ఆట నేర్చుకోనేటందుకు రావటమువల్ల మీరిల్లా మాట్లాడవచ్చునా? ఈ నవయుగంలో ఒక స్త్రీ ఒక పురుషుడితో చనువుగా ప్రవర్తిస్తోందంటే దానికి అర్థము ఆమె అతనిని ప్రేమిస్తోందనేనా? ఇదేనా మీరు చదువుకొన్నది? ఇదేనా మీరు తెలుసుకొన్నది? మీరు నన్ను పెళ్ళి చేసుకోనేటందుకు తగిన అంతస్తులేనివారని నేను చెప్పటములేదు. కాని నేనెవరో మీకు తెలుసునా? నా గురించి మీకేమైనా తెలుసునా? మన పెళ్లికి యీ పదిహేను రోజుల స్నేహమే చాలు ననుకొంటున్నారా?" అని కొంచెము తీవ్రంగానే ఖండించింది హేమావతి.

ఆమె మాటలు శేఖర్‌ను చిత్రవధ చేసినట్లయింది. అంత కోపము ఒక్క నిముషములోనే మాయమయింది. స్త్రీ హృదయం అంటే యిల్లాగే వుంటుంది కాబోలు అనుకొన్నాడు శేఖర్.

"క్షమించండి. తొందరపడి మీ మనస్సును నొప్పించాను" అన్నాడు శేఖర్.

"అనవలసినదేదో అనేశారు. ఫర్వాలేదు. మిమ్మల్ని నేను నమ్ముతున్నాను. నేను మీ విషయంలో కొన్ని వివరాలు తెలుసుకోవాలనుకొంటున్నాను. అవి పూర్తిగా తెలుసుకొన్నాక నేను తృప్తిచెందితే తప్పకుండా మిమ్మల్నే చేసుకొంటాను." అంటూ లేచింది హేమావతి.

ఆ నాటికి వారి సంభాషణ ముగిసింది. శేఖర్ వెళ్ళిపోయాడు.

* * *

## 4

"ఎవరీ హేమావతి?" ఎన్ని విధాల ప్రయత్నించినా శేఖర్‌కు సమాధానము దొరకలేదు. కనీసము ఆమె తండ్రిపేరు కూడా తెలుసుకోలేకపోయాడు. ఈ ప్రశ్నే అతనిని చాలా బాధిస్తోంది.

మామూలుగానే యింకొక నెల రోజులు టెన్నిస్ ప్రాకీసు జరిగింది. హేమావతి మాత్రము తనలో ఏమిమార్పురానివ్వకుండా మామూలుగానే సంచరించింది. కాని శేఖర్‌ని "సిగ్గు" బాగా ఆవహించింది. అనేకసార్లు మాటలుకూడా తడబడ్డాడు. తనునుగురించి విచారిస్తానందే, తన తల్లి తండ్రులను కలుసుకొంటుందేమోనని చాలా భియపడ్డాడు. మరొక నెల గడిచింది.

ఒక రోజున టెన్నిస్ ఆట పూర్తయిన తర్వాత "మీతో కొంచెము మాట్లాడాలి. ఒకసారి యింటికి వస్తారా!" అని అడిగింది హేమావతి.

తన విషయంలో విచారణ పూర్తయింది కాబోలు. ఏమేమి తెలుసుకొందో అని జంకుతూనే హేమావతి వెంట వెళ్ళాడు శేఖర్.

మామూలుగానే మేడమీద గదిలో కూర్చున్నారు. కాఫీ ఫలాహారములు అయిన తరువాత హేమావతే ముందుగామాట్లాడింది.

మిస్టర్ శేఖర్! ఆనాడు అకస్మాత్తుగా, అనాలోచితంగా మీరు వేసిన ప్రశ్న నన్ను చాలా కలవరపరిచింది. మనము వివాహాము చేసుకోనేముందు నాకు కలిగిన సందేహాలను మీరు నివృత్తి చేయగలరనుకొంటాను."

"ఏమిటి ఆ సందేహాలు?"

"మీరు పెళ్ళిచేసికొంటానని చెప్పి, ప్రేమించినట్లు నటించి కాలేజీ అమ్మాయిలను మొదలయినవాళ్ళను మోసగిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు మీ సమాధానము?"

"లేదు. పచ్చి అబద్ధము" అన్నాడు శేఖర్ ఉద్రేకంతో.

"మీ క్లాస్‌మేట్ వనజను పెళ్ళి చేసుకొంటానని మీ స్నేహితులందరితోను చెప్పినట్లు మరొకవార!"

ప్రశ్నకు వెంటనే సమాధానము చెప్పటానికి శేఖరుకు సాధ్యముకాలేదు. కొంచెము ఆలోచించి "నేను వనజా స్నేహంగా వుండటము, దానికి తోడు అఖిలభారత టెన్నిసు పందెములలో గెలిచిన తరువాత యింకా చనువుగా వుండటము చూసినవాళ్లు ఆ విధంగా నా విషయములో కథలు కడితే నేనేమి సమాధానము చెప్పగలను?" అన్నాడు శేఖర్.

"సింగపూరులో వున్న మీ మేనమామ కూతురును మీకిచ్చి తప్పక పెళ్లి చేస్తానని మీ నాన్నగారువాళ్లకువాగ్దానాలుచేసికొన్నారుటగా! మరి మీరు ఆ అమ్మాయిని ఎందుకు చేసికోలేదు?"

"ఏ కాలంలోనో జరిగిన వాగ్దానానికి నేనా బాధ్యుణ్ణి?"

"ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోనేందుకు మీరుకూడ ఒప్పుకొన్నారేమో!"

"లేదు."

"అబద్దాల్లో పచ్చి అబద్ధము. నాకు కావలసింది నిజము."

"నేను ఒప్పుకోలేదు. నా తల్లితండ్రులు


పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.

# ★ స్వతంత్ర వివాహము ★

అస్తమానం ఆ విషయమే మాట్లాడుకొనే వారు. కాని నేను ఆవిషయంలో కలగ చేసుకోలేదు."

"చింత చచ్చినా పులుసు చావలేదన్నట్లుంది నీ విమర్శ" అంటూ కోపంగా హేమావతి లోపలికివెళ్ళి ఒక ఉత్తరము తెచ్చి యిస్తూ "ఇది ఎవరు రాశారు?" అంది.

అది యిదివరలో సుబ్బులు స్కూల్ ఫైనల్ చదువుతూండగా శేఖర్ వ్రాసిన ప్రేమ లేఖ. ఆ ఉత్తరం చూసిన శేఖర్‌కు తల పగిలినంతపని అయింది. కొంచెము సేపు ఏమీ మాట్లాడలేక పోయాడు. హేమావతి సామాన్యస్త్రీయో, లేక రహస్య పరిశోధకురాలో అతనికి అర్థం కాలేదు.

"ఇది నేను వ్రాసినదే. కాని యిది మీకు ఎల్లా వచ్చింది?"

"ఎల్లా వస్తే మీ కెందుకు? మీ గురించి భోగట్టా చేస్తే యిటువంటివి బయట పడుతున్నాయి. ఈ ఉత్తరంలో ఆదర్శప్రేమ అంటూ, ప్రేమంతా ఒలికించినట్లు వ్రాసి, తర్వాత ఆమెను చేసుకోనని మొండిపట్టు పట్టుకొని కూర్చొన్నారే! తీరా నేను మిమ్మల్ని పెళ్లిచేసుకొన్నాక, రేపు నాకన్న అందమైనది, నాకన్న చదువుకొన్నది, నాకన్న ధనవంతురాలు మీకంటికి కనిపిస్తే నా గతి ఏమౌతుంది? మీ ఆదర్శప్రేమగతి ఏమౌతుంది? పెద్ద చదువు చదువుకొని యింత


